



అదిరే రన్

- రంగనాయకసాగర్ కట్టపై హాఫ్ మారథాన్
- భారీగా తరలివచ్చిన ఔత్సాహికులు
- హాజరైన ఎంపీ రఘునందన్‌రావు, సినీనటుడు సంపూర్ణేష్ బాబు

7





కార్యక్రమంలో డ్యాన్స్ చేస్తున్న సంపూర్ణేష్ బాబు

హాఫ్ మారథాన్‌లో యువతి

మురిసిన రైతన్న

ఆశలు చిగురింపజేసిన వానలు!

- జిల్లాలో 27 శాతం అధిక వర్షపాతం
- 4 మండలాల్లో అత్యధికంగా నమోదు
- జలకళను సంతరించుకున్న చెరువులు, కుంటలు
- వరిసాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

సిద్దిపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభంలో వరుణుడు ముఖం చాటేయడంతో సిద్దిపేట జిల్లా రైతులు ఆందోళన చెందారు. తొలకరి జల్లులకు సాగు మొదలుపెట్టిన అన్నదాతలకు నిరాశే ఎదురైంది. వేసిన పంటలు ఎండిపోతాయేమోనని భయపడ్డారు. అయితే, వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు చిగురింపజేశాయి. మొదట కురిసిన వర్షాలకు చిగురించిన పంటలు మళ్లీ జీవం పోసుకున్నాయి. ఆలస్యమైనా సరే, వరిసాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. సాధారణంగా జిల్లాలో 3.76 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఈ విస్తీర్ణం 10 శాతానికి పైగా పెరిగే అవకాశం ఉంది.

వానాకాలం సీజన్‌లో జిల్లాలో 5,60,592 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. గత ఏడాది 5,70,352.30 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది కూడా వరి సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. 3,76,901 ఎకరాల్లో వరి సాగు ఉంటుందని అంచనా. వర్షాలు ఆలస్యమైనా, ప్రస్తుత వానలతో రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు.

పొంగిపొర్లుతున్న చెరువులు, చెక్‌డ్యాంలు

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లా జలకళను సంతరించుకుంది. చెరువులు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలోని 26 మండలాలకు గానూ 4 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. 12 మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ, 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గజ్వేల్ మండలంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంగా జూలైలో సాధారణంగా 272.4 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 347.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 27 శాతం అధిక వర్షపాతం నమోదైంది.



ఇటీవల కురిసిన వర్షాలకు జీవం పోసుకున్న పత్తి



వరినాట్లు వేసేందుకు ట్రాక్టర్ల సహాయంతో దున్నుతున్న రైతులు



వరినాట్లు వేస్తున్న కూలీలు

వరి చేలకు మేలు



కొన్నిరోజుల పాటు కురిసిన వర్షాలతో వరి చేలకు మేలు జరిగింది. ఎక్కువ విస్తీర్ణంలో పొలాలు దున్నుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఇతర పంటలు కూడా ఎండిపోయే సమయంలో వర్షాలు కురవడంతో పంటలు జీవం పోసుకున్నాయి.

- ఎస్.పరశురాములు, రైతు, బట్టిరామన్నపల్లి

ఇంకా వర్షాలు కురవాలి



వరుసగా కురిసిన వర్షాలతో పొలాలకు లాభం జరిగింది. చెరువులు, కుంటలు ఇంకా పూర్తిగా నిండలేదు. చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి బోర్లలోకి నీళ్లు రావాలంటే మళ్లీ వర్షాలు కురిస్తే లాభం జరుగుతుంది. ఇంకా వర్షాలు కురవాలని కోరుకుంటున్నాం.

- బి. రాజేందర్, రైతు, పొన్నాల

మండలం	కురవాల్సింది (మి.మీ)	కురిసింది	సగటు తేడా
1. దుబ్బాక	296.6	446..4	51.0
2. సిద్దిపేట రూరల్	265.4	381.9	44.0
3. చిన్నకోడూర్	253.5	384.4	52.0
4. బెజ్జంకి	305.8	399.6	31.0
5. కోహెడ	287.9	463.0	61.0
6. హుస్నాబాద్	332.0	446.5	34.0
7. అక్కన్నపేట	312.0	422.6	35.0
8. నంగునూర్	264.8	385.0	45.0
9. సిద్దిపేట అర్బన్	268.2	455.6	70.0
10. తొగుట	260.6	321.6	23.0
11. మిరుదొడ్డి	275.2	262.5	-5.0
12. దౌల్తాబాద్	241.4	314.7	30.0
13. రాయపోల్	233.9	236.4	1.0
14. వర్గల్	256.3	264.2	3.0
15. ములుగు	268.9	254.5	-5.0
16. మర్కూక్	247.7	295.8	19.0
17. జగదేవ్‌పూర్	254.0	258.1	2.0
18. గజ్వేల్	263.1	202.3	-23.0
19. కొండపాక	260.4	318.0	22.0
20. కొమురవెల్లి	274.2	331.0	21.0
21. చేర్యాల	262.7	262.3	0.0
22. మద్దూరు	299.6	293.1	-2.0
23. నారాయణరావుపేట	256.6	533.0	108.0
24. దూళిమిట్ట	298.4	500.2	68.0
25. అక్బర్‌పేట-భూంపల్లి	284.6	364.8	28.0
26. కుకునూరుపల్లి	258.6	227.3	-12.0
మొత్తం	272.0	347.1	27.0



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం

ఎక్కడి పనులు అక్కడే

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పడకేసిన ప్రగతి
- పద్దెనిమిది నెలలుగా నిలిచిపోయిన పనులు
- అటకెక్కిన రింగ్, రేడియల్ రోడ్లు, బస్టాండ్ల నిర్మాణం
- పరస్పర ఆరోపణలకే అధికార, ప్రతిపక్ష నేతలు పరిమితం
- ఎన్నికల ముందైనా పనులు జరిగేనా..?!

గజ్వేల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రగతి పడకేసింది. 18 నెలలుగా ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో, కనీసం ఎన్నికల ముందైనా ఈ పనులు పూర్తవుతాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం

గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు గడిచిన 18 నెలలుగా నిలిచిపోయాయి. దీనిపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను బాధ్యులుగా చేస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీనే పనులు పూర్తి చేయాలని ఆరోపిస్తున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై దాదాపు 40 గుంతలు ఉన్నా పూడ్చే నాథుడు లేకపోవడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

రింగ్‌రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి కీలకమైన రూ3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన 21.7 కిలోమీటర్ల రింగ్‌రోడ్డు పనులు ఏడాదిన్నరగా ముందుకు సాగడం లేదు. దీనివల్ల భారీ వాహనాలు పట్టణంలోకి వచ్చి అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. కేవలం 150 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే భారీ వాహనాలు పట్టణం వెలుపల నుంచి వెళ్తాయి. అలాగే, రింగ్‌రోడ్డుకు అనుసంధానంగా చేపట్టిన రేడియల్ రోడ్ల అభివృద్ధి కూడా అటకెక్కింది. పిడిచెడ్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, సంగాపూర్ రోడ్డు, ముట్రాజ్‌పల్లి రోడ్లు సహా ఏ ఒక్క రోడ్డు కూడా పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా, జంక్షన్ల వద్ద అభివృద్ధి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



ఎడ్యుకేషన్‌హబ్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

తాగునీటి సమస్య, బస్టాండ్ల దుస్థితి..

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. మిషన్ భగీరథ పనులు పూర్తికాకపోవడం, మల్లన్నసాగర్ వద్ద వాటర్ పైపులైన్ పనులు నత్తనడకన సాగడం వల్ల మూడు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పనుల వేగవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నా, ప్రజాప్రతినిధుల చొరవ కొరవడింది.

మిగతా 8వ పేజీలో

మహిళా సంఘాలకు వడ్డీ బకాయిలు విడుదల!

- జిల్లాకు రూ. 28.96 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న సభ్యులు

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మహిళా సంఘాలకు వడ్డీ బకాయిలు విడుదలయ్యాయి. దాదాపు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలు మంజూరు కావడంతో మహిళా సంఘాల్లో ఆనందం నెలకొన్నది. రుణాలు సక్రమంగా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది. జిల్లా వ్యాప్తంగా 16,654 మహిళా సంఘాలకు రూ. 28.96 కోట్లు విడుదలయ్యాయి. ఈ వడ్డీ సొమ్ము మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. దీంతో పలు మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించిన వారికే..

జిల్లాలో మొత్తం 18,332 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుంది. వారి వ్యాపారాలు, ఇతర పనులకు ప్రోత్సాహం అందించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న సంఘాలు ప్రతి నెలా అసలు, వడ్డీని క్రమం తప్పకుండా చెల్లించాలి. అలా సక్రమంగా చెల్లించిన మహిళా సంఘాలకే ప్రభుత్వం తిరిగి వడ్డీని ఖాతాల్లో జమ చేస్తుంది. జిల్లాలో అధిక సంఖ్యలో సంఘాలు ఉన్నప్పటికీ,16,654 సంఘాలు మాత్రమే సకాలంలో రుణాలు చెల్లించాయి. ఆ సంఘాలకు ఇప్పుడు వడ్డీ బకాయిలు అందనున్నాయి. దీంతో మహిళా సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి .

వంతెన నిర్మాణానికి మోక్షమెన్నడో?

- గత ప్రభుత్వంలో రామునిపట్ల-గోనెపల్లి మధ్య హైలెవల్ వంతెనకు రూ. 14.45 కోట్ల నిధులు మంజూరు
- 2023లో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన
- ఏడాదిన్నర గడిచినా ప్రారంభం కాని నిర్మాణ పనులు
- ప్రస్తుతం వరద వస్తే రాకపోకలకు బ్రేక్
- పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

8

టీచర్ల పదోన్నతులకు సర్కారు గ్రీన్‌సిగ్నల్

- నేడు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం
- ఇప్పటికే ఎస్ఏల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి

6

ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా ఆర్వోబీ పనులు చేపట్టాలి : ఎంపీ

7

ఐదుగురిపై కుక్కలు, మరొకరిపై కోతి దాడి

- దుబ్బాక ఆసుపత్రిలో చికిత్స

దుబ్బాక/మిరుదొడ్డి, జూలై27(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా దుబ్బాక, మిరుదొడి మండలాల్లో కుక్కలు, కోతులు ఆదివారం స్వైరవిహారం చేశాయి. దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్‌కు చెందిన మల్లయ్య(84), మండలంలోని రాజక్కపేటకు చెందిన గోవర్ధన్‌రెడ్డి(45), హబ్షీపూర్‌కు చెందిన గౌరవ్వ(58), మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌కు చెందిన బిక్షపతి(45), మోతే గ్రామానికి చెందిన రాజిరెడ్డి(45)పై ఆదివారం ఆయా గ్రామాల్లో కుక్కలు దాడి చేశాయి. తీవ్రగాయలైన వారిని దుబ్బాక ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అలాగే దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ వార్డుకు చెందిన సత్యనారాయణ(43)పై కోతిదాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. ఆయనకు దుబ్బాక సివిల్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు.

ప్లాస్టిక్‌రహిత హుస్నాబాద్ దిశగా అడుగులు

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్/కోహెడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామాన ప్లాస్టిక్ వాడకాన్ని సమూలంగా అంతం చేసి, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామని, అందుకు ఆడబిడ్డలంతా దీక్ష బూనాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని శుభం గార్డెన్‌లో కొత్త రేషన్‌కార్డులు, సన్నబియ్యం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సోలార్ ప్లాంట్ మంజూరు, పావలా వడ్డీ రుణాల చెక్కులు, స్టీల్ బ్యాంకులను మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతితో కలిసి మహిళలకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఇంట్లో ఐదు రకాల మొక్కలు (తులసి, మునగ, కరివేపాకు, నిమ్మ, జామ) నాటాలని మంత్రి సూచించారు. ఇకపై గ్రామాల్లో జరిగే ప్రతి కార్యక్రమంలో మహిళా సంఘాలకు ఇచ్చిన 21 రకాల స్టీల్ వస్తువులను వినియోగించుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వాడితే అధికారులు ఇకమీదట రూపాయి జరిమానా విధిస్తారన్నారు. అంతకుముందు పోతారం(ఎస్) జాతీయ రహదారి పక్కన వనమహోత్సవంలో మొక్కలు నాటారు. హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో రూ.2.57 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు, మహిళా సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కును అందజేస్తున్న మంత్రి పొన్నం

తంగళ్లపల్లిలో..

కోహెడ మండలం తంగళ్లపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఆదివారం కలెక్టర్ హైమావతితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ స్థలాన్ని చదును చేస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం తంగళ్లపల్లి నుండి వయా కూరెళ్ల వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. బస్వాపూర్‌లో మంత్రి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

బురద రోడ్డుపై నాట్లు



బురద రోడ్డుపై నాటు వేస్తున్న తండావాసులు

హవేలిఘనపూర్ జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని స్కూల్ తండాలో బురదమయంగా మారిన రోడ్డుపై తండా వాసులు నాటు వేసి నిరసన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి తండాకు వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా మారింది. దీంతో ఆ బురదలో వారు వరినాటు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ .. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షానికి రోడ్డు పూర్తిగా చిత్తడిగా మారి కనీసం నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని తండా వాసులు కోరారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

సంగారెడ్డి రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు తన పర్సుని పోగొట్టుకోగా గమనించిన కండక్టర్ తిరిగి ఆ పర్సును ఆమెకి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. నారాయణఖేడ్ నుంచి లింగంపల్లివెళ్లే సంగారెడ్డి డిపోకు చెందిన టీఎస్15జెడ్ 0023 నంబరు గల ఆర్టీసి బస్సులో పెద్ద శంకరంపేటలో ఎక్కిన ఓ ప్రయాణికురాలు బోడ్మట్‌పల్లిలో దిగింది. ఆమె తన పర్సును బస్సులోనే మర్చిపోగా దానిని కండక్టర్ రవినేత తీసుకుని పరిశీలించగా అందులో రూ.2050 నగదుతో పాటు ఒక వెండి ఉంగరం, ఫోన్ నంబర్ల బుక్కులు ఉన్నాయి. బుక్కులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా ప్రయాణికురాలి కుమారుడు లిఫ్ట్ చేశాడు. మీ అమ్మగారు బస్సులో పర్సు మర్చిపోయారని, చెప్పాడు. తిరుగు ప్రయాణంలో బోడ్మట్‌పల్లి వద్ద ప్రయాణికురాలికి ఆ పర్సుని కండక్టర్ రవినేత అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. తన పర్సు నిజాయితీగా ఇచ్చినందుకు ప్రయాణికురాలు కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీచర్ల పదోన్నతులకు సర్కారు గ్రీన్‌సిగ్నల్

- నేడు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం
- ఇప్పటికే ఎస్ఏల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతులకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. వాస్తవానికి పదోన్నతుల కంటే ముందు బదిలీలు చేపట్టాల్సి ఉన్నది. ఈ ప్రక్రియ అంతా వేసవి సెలవుల్లో చేపట్టాల్సి ఉన్నా, నిర్వహించలేదు. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమైనందున ప్రభుత్వం బదిలీల అంశాన్ని వాయిదా వేసి పదోన్నతులకు మాత్రమే అనుమతించింది. కాగా పదోన్నతుల షెడ్యూల్‌ను విద్యాశాఖ నేడు విడుదల చేసే అవకాశం ఉంది. ఇలా ఉండగా తొమ్మిదేళ్ల తర్వాత పదోన్నతులు, ఆరేళ్ల తర్వాత బదిలీలను గతేడాది నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఏడాది కాలంలో ఖాళీలు ఏర్పడినా స్థానాలను పదోన్నతులతో భర్తీ చేయనున్నారు. పదోన్నతుల కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు సర్కారు తీపి కబురు అందించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఏ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా, సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. ఖాళీల్లో 70 శాతం స్థానాలను మాత్రమే పదోన్నతి ద్వారా భర్తీ చేస్తారు. ఇలా ఉండగా జీహెచ్‌ఎం పదోన్నతి పొందేందుకు స్కూల్ అసిస్టెంట్ టీచర్ల ధ్రువపత్రాల పరిశీలనను ఈ నెల 8, 9 తేదీల్లో పూర్తి చేశారు. దీంతో వచ్చే షెడ్యూల్ ప్రకారం మల్టీజోన్-2 పరిధిలో స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించనున్నారు. అయితే సంగారెడ్డి జిల్లాలో సుమారు 31 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 24 ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు, 176 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

1250 గ్రాముల పొడి గంజాయి పట్టివేత

మునిపల్లి, జూలై27 (ఆంధ్రజ్యోతి): బీదర్ నుంచి హైదరాబాద్ వైపు అక్రమంగా సరఫరా చేస్తున్న 1250గ్రాముల పొడి గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కంకోల్ టోల్ ప్లాజా వద్ద పటుకున్నారు. కర్ణాటక నుంచి తెలంగాణకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో మెదక్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఎఐఈఎస్, మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షణలో ఎక్సైజ్ శాఖ సీఐ వీనారెడ్డి ఆధ్వర్యంలో శనివారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ ద్విచక్రవాహనంపై అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేయగా అందులో 1250గ్రాముల పొడి గంజాయి ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. దీంతో వారిని విచారించగా హైదరాబాద్‌లోని ముసాపేటకు చెందిన పి. శ్రీధర్, ధనంజయ బెహరా అనే ఇద్దరు బీదర్‌లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. పట్టుబడిన పొడి గంజాయి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గోవాలో మద్యం

గోవాలో కొనుగోలు మద్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో భాగంగా గోవా రాష్ట్రం నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేయగా ఓ వాహనంలో 6.5లీటర్ల ఎన్‌డీపీఎల్ గోవా మద్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకొని గోవా సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.

ఆకట్టుకున్న యోగా విన్యాసాలు



ఆసనాలు వేయిస్తున్న యోగా సాధకులు



ఎంపికైన యోగా క్రీడాకారులు

సిద్దిపేట కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో జిల్లా యోగా సెలెక్షన్స్ జరిగాయి. 18 నుంచి 28, 28 నుంచి 35 35 నుంచి 45, 45 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్కుల వారికి పోటీలు నిర్వహించారు. పురుషులకు, మహిళల వేర్వేరుగా సెలెక్షన్స్ నిర్వహించారు. ట్రెడిషనల్ యోగాసన ,ఫార్వర్డ్ బెండింగు ,బ్యాక్ బెండింగు , ట్విస్టింగ్ , లెగ్గు బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, ఆర్టిస్టిక్ యోగాసన, రిథమిక యోగాసన విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి యోగా సాధకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు



తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా చేరుతున్న నీరు

కొమురవెల్లి, జూలై27 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో పూర్తిస్థాయిలో నింపే కార్యక్రమంలో భాగంగా ఆదివారంసాయంత్రం ఫేజ్-3 పంపు ద్వారా నీటి పంపింగ్ ప్రారంభమైంది. ఇప్పటికే ఫేజ్-2 పంపు ద్వారా రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుంది. రెండు పంపుల ద్వారా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరుతుండటంతో పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది. ఒకవైపు విస్తారంగా వర్షాలు పడుతుండటంతో పాటు రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు జూలై 27 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వేతన ఒప్పందాలు చేస్తూ కార్మికులకు అండగా నిలుస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు అన్నారు. ఈ మేరకు ఆదివారం పటాన్‌చెరు ఐలా భవన్‌లో కిర్బీ పరిశ్రమ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు నిత్యం పోరాటాలు చేస్తామన్నారు. రానున్న కార్మిక గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ చుక్క గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నవ సమాజ నిర్మాణం

నవ సమాజ నిర్మాణం మార్క్సిస్టు సిద్ధాంతాలతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కారాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలు శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతుంటే మన దేశంలో మాత్రం మూఢాచారాలకు పెద్దపీట వేస్తూ బీజేపీ పాలన సాగిస్తుందని విమర్శించారు. సమాజంలో సామాజిక అసమానతలు, మహిళలపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కులాల పేరిట విద్వేశాలు రెచ్చగొడుతూ ప్రశాంతంగా ఉన్న వారి మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కొమురవెల్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి ఆదివారం సందర్భంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో భక్తులు సందడి చేశారు. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖమండపంలో పట్నాలు రచించి బోనాలు చెల్లించారు. పలువురు భక్తులు ముఖ మండపంలో స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం మల్లికార్జున స్వామిని దర్శించుకొని బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విజయాచల గుట్టపై ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు పట్టువస్త్రాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు.

మెదక్ చర్చిలో సందడి

మెదక్, కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రోజూ వర్షాలు కురుస్తున్నా భక్తుల సందడి మాత్రం తగ్గలేదు. ఈ ప్రార్థనలకు చుట్టు పక్క గ్రామాల నుంచే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న జిల్లాల నుంచి ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక, మహారాష్ట్రల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.. దీంతో చర్చిలోపల ఉన్న ప్రత్యేక ప్రార్థన మందిరం భక్తులతో కిక్కిరిసింది .చర్చి ఆవరణ మొత్తం ఏసు నామ స్మరణతో మారు మ్రోగింది.

ఉద్యమం ఆగదు

సంగారెడ్డి రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కుదించి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసేవరకు ఉద్యమం ఆగదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అన్నారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన నాలుగవ మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మికులు నిరంతరం పనిచేస్తున్న పని ప్రదేశాల్లో భద్రత కరువైందన్నారు. పరిశ్రమ యాజమాన్యాలు కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఈఎస్ఐ, పీఎస్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి కూడా కనీస వేతనాలు అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చేర్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. భూతగాదా విషయంలో ఇతరుల బెదిరింపులు, పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన సాంబని కనకయ్య ఆదివారం ఉదయం తన వ్యవసాయబావివద్ద గడ్డినివారణ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇటీవల గ్రామంలో గొట్టం గోపాల్‌రెడ్డి, కూసుకుంట్ల బాలకృష్ణా రెడ్డిల మధ్య జరిగిన భూతగాదాకు సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు. ఈవిషయమై గోపాల్‌రెడ్డి మూడురోజులక్రితం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో కనకయ్యను విచారణకు పిలిచి ఫోన్‌ను లాక్కున్నారు. ఇరువర్గాలను మాట్లాడుకోవాలని సూచించినప్పటికీ కొలిక్కి రాలేదు. ఆదివారం ఉదయం కనకయ్యను స్టేషన్‌కు తీసుకురావాలని మధ్యవర్తికి పోలీసులు సూచించారు. దీంతో తనను అకారణంగా వేధిస్తుండటం తోపాటు బెదిరిస్తున్నారని పేర్కొంటూ వ్యవసాయబావి వద్ద పురుగులమందు తాగానని అతడి తమ్ముడు సాంబ ని బాబుకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన కనకయ్యను చికిత్స నిమిత్తం చేర్యాలప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం.. మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతున్నారు. ఈవిషయమై గొట్టం గోపాల్‌రెడ్డి, కూసుకుంట్ల బాలకృష్ణారెడ్డితో పాటు కొమురవెల్లి ఎస్సై రాజుపై చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య మంజుల చేర్యాల సీఐతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. కాగా ఈవిషయమై కొమురవెల్లి ఎస్సై రాజును వివరణ కోరగా, సాంబని కనకయ్యపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచా రణ నిమిత్తం ఇటీవల పిలిపించడంతో స్టేషన్‌కు మద్యం సేవించి వచ్చాడని తెలిపారు. పురుగులమందు సేవించినట్లు చిత్రీకరిస్తున్నారని, కనకయ్య పట్ల తాము ఎలాంటి వేధింపులకు పాల్పడలేదన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రామచంద్రాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో జరిగింది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడపకు చెందిన రాకేష్‌కుమార్ రెడ్డి(24) తెల్లాపూర్‌లో ఓ ఇంట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో పనులు చూసుకోవడంతో పాటు కుక్కను మలమూత్రాలకు తీసుకుపోవడం, శుభ్రం చేయడం వంటి పనులు చేసేవాడు. కాగా ఆదివారం మేళ్ల చెరువు కట్ట వద్ద ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని సీఐ చెప్పారు. ఈ మేరకు ఎస్సై సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మంజీరాలో యువకుడి గల్లంతు



శాయిబాజ్ (ఫైల్)

పాపన్నపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి) : చేపల వేట కోసం స్నేహితులతో కలసి వెళ్లిన యువకుడు మంజీర నదిలో గల్లంతయ్యాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని ముద్దాపూర్ బ్రిడ్జి వద్ద జరిగింది. పావన్నపేట ఏఎస్సై తుక్కయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన శాయిబాజ్ (25) మెదక్ పట్టణంలో ఆర్టీఏ బ్రోకర్‌గా వనిచేస్తున్నాడు. ఆదివారం ఆరుగురు స్నేహితులతో కలసి పాపన్నపేట మండలంలోని ముద్దాపూర్ బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. అక్కడ చేపలు పట్టే క్రమంలో మంజీర ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటిలో కొట్టుకు పోయాడు. కాగా సాయంత్రం వరకు అతడి ఆచూకీ దొరక లేదు. మృతుడికి పెళ్లి కాగా, పిల్లలు లేరు. మృతుడికుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

పటాన్‌చెరు జూలై 27 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధి శివారు ప్రాంతంలోని రేణుకాఎల్లమ్మ ఆలయం వెనకవైపు కేబుల్‌వైర్‌కు మృతదేహం వేలాడుతూ ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే అస్తిపంజరంగా తయారయింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో ఉంచారు.

నారింజ వాగులో పడి వృద్ధుడి మృతి

ఝరాసంగం, జూలై27 (ఆంధ్రజ్యోతి): నారింజ వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మాచునూర్ గ్రామ శివారులో జరిగింది. ఎస్సై-2 నారయణ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామానికి చెందిన రాములు(73) అనే వృద్ధుడు ఈ నెల 23న ఇంట్లో నుంచి తప్పిపోయినట్లు జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కుమారుడు నర్సింలు ఫిర్యాదు చేశాడు. మూడు రోజుల నుంచి బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరక లేదు. ఆదివారం సాయంత్రం నారింజ పరివాహక ప్రాంతమైన మాచునూర్ గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో వృద్ధుడి శవం కన్పించడంతో, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు స్థానిక ఝరాసంగం పోలీస్‌లకు తెలపడంతో శవాన్ని ట్రాక్టర్‌పై పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరిలించారు. కుమారుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరి అదృశ్యం



సుజాత (ఫైల్)

జహీరాబాద్/రామాయంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. రామాయంపేట పట్టణానికి చెందిన చాకలి సుజాత(40)అదృశ్యమయింది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలోనూ వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం ఆమె కూతురు దుర్గాభవాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



బసంతాపూర్ ఎల్లారెడ్డి(ఫైల్)

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌కు చెందిన బసంతాపూర్ ఎల్లారెడ్డి(70)ఈ నెల 25న అదృశ్యమయ్యాడని జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం రంజోల్‌కు చెందిన బసంతాపూర్ ఎల్లారెడ్డి తనకూతురు ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్యాడు. తీరా రెండురోజుల తర్వాత చూస్తే అతడు కూతురు ఇంటికి వెళ్ళలేదు. ఇరుగు పొరుగువారి వద్దకు వెళ్ళలేదని కుటుంబసభ్యులు తెలిపారు. అదృశ్యమైన ఎల్లారెడ్డి కుమారుడు రాజీరెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే 8712661847, 8712656764, 8712656731 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.



అదిరన్

- రంగనాయకసాగర్ కట్టపై హాఫ్ మారథాన్
- ఆద్యంతం ఉత్సాహంగా..
- భారీగా పాల్గొన్న ఔత్సాహికులు
- హాజరైన ఎంపీ రఘునందన్‌రావు, సినీ నటుడు సంపూర్ణేష్ బాబు

చిన్నకోడూరు/సిద్దిపేట కల్చరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జిల్లా పోలీసు శాఖ సహకారంతో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్టపై ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథాన్ (21కే), 10కే, 5కే రన్ ఆహ్లాదంగా సాగింది. చిన్న, పెద్ద తేడా లేకుండా సుమారు 2 వేల మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల వల్ల వచ్చే అనర్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సందేశమిస్తూ చేపట్టిన రన్‌లో... సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాఫ్ మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా పట్ల ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. నేను బాగుండాలి నా ఇల్లు బాగుండాలనే స్థితి నుంచి ప్రజలందరూ బాగుండాలనే స్థితికి వచ్చామన్నారు. డయాబెటిస్‌కు పుట్టినిల్లు భారతదేశం అనే స్థితి నుంచి బయటకు రావాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రజలందరికీ అవగాహన రావడం సంతోషంగా ఉందన్నారు. సినీ నటుడు సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలన్నారు. సిద్దిపేట మాజీ ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాం మాట్లాడుతూ హాఫ్ మారథాన్ మూడవ ఎడిషన్ విజయవంతంగా పూర్తయిందని, ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, పారిశ్రామిక వేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి, సిద్దిపేట రన్నర్స్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



10 హాఫ్ మారథాన్‌లలో పాల్గొన్నా..



నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాను. ఇప్పటివరకు 10 వరకు హాఫ్ మారథాన్‌లలో పాల్గొన్నాను. సిద్దిపేటలో పాల్గొనడం ఇదే మొదటి సారి, మూడవ స్థానంలో నిలిచాను.

- జయశ్రీ, సిద్దిపేట

గతంలో 80 కి.మీ రన్‌లో రెండోస్థానం..



మాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా రావులపాలెం. సిద్దిపేటలో హాఫ్ మారథాన్‌లో పాల్గొనడం ఇదే మొదటి సారి. 20 హాఫ్ మారథాన్‌లు, 2 మారథాన్‌లు చేశాను. గతేడాది డిసెంబర్‌లో పాడేరులో జరిగిన అల్ట్రా ట్రైల్ మారథాన్‌లో (80 కి.మీ.) రెండవ స్థానంలో నిలిచాను. గత ఫిబ్రవరిలో గుజరాత్ రాష్ట్రం వడోదరలో జరిగిన మారథాన్‌లో (40-50 ఏజీ కేటగిరీ) మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకంతో పాటు, రూ.30 వేల నగదు బహుమతి అందుకున్నాను. ఇక్కడ 41 ఏళ్ల పైబడిన పురుషుల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాను.

-రామరాజు, (రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ) ఆంధ్రప్రదేశ్

సిద్దిపేటలో రెండోసారి..



సిద్దిపేటలో గతేడాది నిర్వహించిన, ఈ సారి నిర్వహించిన హాఫ్ మారథాన్‌లలో పాల్గొన్నాను. ఈ హాఫ్ మారథాన్‌లో రెండవ స్థానంలో నిలిచాను. ఎంతో ఆనందంగా ఉంది.

- సునీమ, హైదరాబాద్

మూడు హాఫ్ మారథాన్‌లలో ఫస్టే..



మాది మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ జిల్లా. నేను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాను. తెలంగాణలో మూడు హాఫ్ మారథాన్‌లలో పాల్గొనగా మూడింటిలో మొదటి స్థానంలో రావడం హ్యాపీగా ఫీలవుతున్నాను. హైదరాబాద్‌లో రెండు సార్లు, సిద్దిపేటలో ఈ హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నాను.

-దివ్యాన్స్ తోమర్, మధ్యప్రదేశ్

50కి పైగా హాఫ్ మారథాన్‌లలో..



మాది నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామం. ఇప్పటి వరకు ఢిల్లీ, ముంబాయి, చెన్నై, హైదరాబాద్, గుజరాత్, అహ్మదాబాద్‌లలో జరిగిన సుమారు 50 హాఫ్ మారథాన్‌లలో, 5 మారథాన్‌లలో పాల్గొన్నాను. సిద్దిపేటలో ప్రస్తుత హాఫ్ మారథాన్‌లో పురుషుల విభాగంలో రెండవ స్థానంలో నిలిచాను.

- రమేష్ చంద్ర

సిద్దిపేటలో మొదటిసారి..



నేను ఇప్పటివరకు 60 పైగా హాఫ్ మారథాన్‌లలో పాల్గొన్నాను. రిటైర్డ్ ఆర్మీని. ప్రస్తుతం మహబూబాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాను. సిద్దిపేటలో హాఫ్ మారథాన్‌లో పాల్గొనడం ఇది మొదటి సారి. మూడవ స్థానంలో నిలిచాను.

-లింగారెడ్డి, కంబాలపల్లి, మహబూబాబాద్

మూడింటిలోనూ మొదటి స్థానమే..



మాది సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామం. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథ్లెటిక్స్ ప్రాక్టీస్ చేస్తున్నాను. నేను సిద్దిపేటలో నిర్వహించిన మూడు హాఫ్ మారథాన్‌లలోనూ మొదటి స్థానాల్లో నిలవడం సంతోషంగా ఉంది.

-ఉమ, సూర్యాపేట



రన్‌లో పాల్గొన్న బాలుడు



యువత డాన్స్



రన్నింగ్ చేస్తున్న దివ్యాంగుడు



విజేతలతో ఎంపీ రఘునందన్‌రావు, సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు తదితరులు

క్రైం కార్నర్

క్రేన్ ఢీకొని యువకుడి మృతి

గజ్వేల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జాలిగామలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ చాన్‌పాషా(24), బాగోత్ చందు(19) ఇద్దరు శనివారం ద్విచక్రవాహనంపై మల్లుపల్లి నుంచి స్టోన్ కటింగ్ బ్లేడ్స్‌ను తీసుకొని గజ్వేల్‌కి వస్తున్నారు. జాలిగామ వద్ద వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని క్రేన్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా స్థానికులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం రామాయంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు పరీక్షించి హైదరాబాద్ కు తీసుకువెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో సయ్యద్ చాన్ పాషా మృతి చెందారు. తన కొడుకు మృతికి కారణమైన క్రేన్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సయ్యద్ సిలార్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గాయపడి చికిత్స పొందుతూ..



కిశోర్ (ఫైల్)

చిన్నశంకరంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి గ్రామంతో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ వివరాకు మేరకు గ్రామానికి చెందిన పోతరాజు కిశోర్ (35) ఈనెల 15న చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని బైక్‌లో పెట్రోల్ పోసుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడి తలకు తీవ్ర గాయలయ్యాయి. కిషోర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నవనీత, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని యువతి హల్‌చల్

సిద్దిపేట క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని రేణుకానగర్ చౌరస్తాలో మతిస్థిమితం కోల్పోయిన ఓ యువతి హంగామా సృష్టించింది. రేణుకానగర్‌లో నివాసం ఉంటున్న మతిస్థిమితం కోల్పోయిన ఓ యువతి(25) ఆదివారం మధ్యాహ్నం ఎదురుపడిన వాహనాలను, స్థానికంగా నిలిచి ఉన్న వాహనాలను పెద్దపెద్ద రాళ్లతో ధ్వంసం చేసింది. ఆ దారి గుండా వెళ్తున్న వాహనదారులపై దాడి చేయడంతో గాయపడ్డారు. దీంతో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాలు భారీగా ధ్వంసం అయ్యాయి. యువతి కుటుంబ సభ్యులు చొరవ తీసుకొనడంతో వివాదం సద్దుమణిగింది.

ఇంద్రేశం రోడ్డు నిర్మించాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు

పటాన్‌చెరు జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పటాన్‌చెరు శ్రామిక్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు ఇంద్రేశం దౌల్తాబాద్ వరకు ఉన్న రోడ్డు అస్తవ్యస్తంగా మారిందన్నారు. 10 ఏళ్లుగా రోడ్డు గుంతలుగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. కంకర మిషన్లు, అరబిందో తత్వ, సెన్నా కౌంటీలకు చెందిన రియల్ వ్యాపారాలు చేసుకోవడానికి పెద్ద ఎత్తున భారీ వాహనాలు తిరుగుతున్నాయన్నారు. రోడ్డు పూర్తిగా గుంతలు అయినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో శాంతకుమార్, పెంటయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సజావుగా జీపీవో, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్ష



సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గ్రామ పాలన అధికారులు (జీపీవో), లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామక పరీక్ష సజావుగా జరిగిందని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఆదివారం ఆమె పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 77 మందికి 62 మంది హాజరుకాగా, 15 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్‌లో థియరీ పరీక్షకు 160 మందికి 129 మంది హాజరుకాగా, 31 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజరాణి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ ఐనేష్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో రెండు విడతలుగా పరీక్ష జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 73 మందికి 63 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 10 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు 113 మంది గానూ.. 105 మంది హాజరు కాగా... 8 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఆర్వో భుజంగరావు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఆర్డీవో రమాదేవి, జెడ్పీ సీఈవో ఎల్లయ్యతో కలిసి డీఆర్వో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష తీరును పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద డీఆర్వో భుజంగరావు, అధికారులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు వందన

చిన్నకోడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు కంచర్ల వందన సూచించారు. చిన్నకోడూరు మండలం అల్లీపూర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో వంట గదిని, వంట సరుకులను, విద్యార్థినులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, సదుపాయాలు, ఉపాధ్యాయుల ప్రవర్తన, విద్యా విధానం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల దుష్పరిణామాల పై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలుంటే చైల్డ్ వెల్ఫేర్ విభాగానికి, చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098కి సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఆమె విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో రాము, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు నర్సింహులు, బాలచందర్, మంజుల, జీసీడీవో నర్మద, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నీలిమ, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ గణేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు వందన

చిట్టారెడ్డి చెరువు ఆనకట్ట పటిష్టం

పుల్‌కల్, జూలై 27 ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పుల్కల్ గ్రామ శివారులోని చిట్టారెడ్డి చెరువు ఆనకట్టపై పడిన గండిని అధికారులు పూడ్చి వేయించారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువు గరిష్ఠ స్థాయి నీటి మట్టానికి చేరుకున్నది. అయితే, ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి చెరువు ఆనకట్ట దెబ్బతిని గండి పడింది. దీంతో తహసీల్దార్ కృష్ణ, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ విశ్వజన్ ఆదివారం పరిశీలించి, ఎక్స్‌కవేటర్ సహాయంతో గండిని పూడ్చి వేయించారు. చెరువులో నీటి మట్టం పెరగడంతో ఏ క్షణమైనా గండిపడే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యగా అప్రమత్తమైన అధికారులు చెరువు ఆనకట్టపై మట్టి పోయించి పటిష్టం చేయించారు. గండిని పూడ్చడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చిట్టారెడ్డి చెరువు ఆనకట్టపై గండి పూడ్చివేయిస్తున్న తహసీల్దార్, ఎంపీవో

ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా ఆర్వోబీ పనులు చేపట్టాలి

● ఎంపీ రఘునందన్‌రావు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

చేగుంట, జూలై 27(ఆంధ్రజ్యోతి): చేగుంటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులు చేపడితే ప్రజలకు, రవాణాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దారి మళ్లింపులు చేసుకోవాలని ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. ఆదివారం చేగుంటలో మెదక్ రోడ్డులోని రైల్వే గేట్ వద్ద దారి మళ్లింపుపై అధికారులతో కలిసి ఆర్వోబీ నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ చేగుంటలో రైల్వే ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.45 కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆగస్టు 2న రైల్వే ఆర్వోబీ నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నట్లు ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. రైల్వే ఆర్వోబీ పనుల కోసం మెటీరియల్ సమకూర్చిన తర్వాత పనులు ప్రారంభించాలని, బ్రిడ్జి పనులను 18 నెలల్లో పూర్తి చేసే విధంగా కృషి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎస్.ఎస్.రావు, కె.నాథీనియల్, కె.ఎస్.రాజారెడ్డి, ఏ.జగదీష్, డి.ప్రసాద్ రావు, సాంబశివరావు, మెదక్ ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్ సింగ్, ఏఈ విజయ సారథి, బీజేపీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాగేందర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు లావణ్య, మాజీ అధ్యక్షులు భూపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుజాత, మాజీ ఎంపీపీ పాండు, అసెంబ్లీ కో కన్వీనర్ గోవింద్, చేగుంట మండల జడ్పిటిసి కన్వీనర్ బిక్షపతి, పట్టణ అధ్యక్షులు సాయిప్రసాద్, నాయకులు బాలచందర్ గణేష్, నాగభూషణం పాల్గొన్నారు.

హక్కుల సాధనకై ఢిల్లీకి కదిలిన ఉద్యోగులు



ఢిల్లీకి వెళ్తూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కంది, జూలై 27(ఆంధ్రజ్యోతి): రక్షణ రంగానికి వెన్నుముకగా నిలిచిన సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో కార్పొరేటీకరణ తరువాత వర్క్‌లోడ్ లేక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పాత పద్ధతిలో పెన్షన్ ఇవ్వాలని గత రెండు సంవత్సరాల నుంచి ఉద్యోగులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు బీజేపీ సీనియర్ నాయకులు నల్ల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) నాయకులు, ఉద్యోగులు ఎల్.బాలనర్సయ్య, బి.ఈశ్వరయ్య, కె.ప్రభు, టి.రవి, బి.శివకుమార్, కంది శ్రీనివాస్, టి.ప్రదీప్ కుమార్ లు ఆదివారం సికింద్రాబాద్ నుంచి ఢిల్లీకి తరలివెళ్లారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి 500 బీఎంపీ-2 యుద్ధ వాహనాలు, నాగ్-2 వెపన్స్ తయారీ ఆర్డర్లు, వర్క్‌లోడ్ పెంచాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరనున్నట్లు ఉద్యోగులు తెలిపారు.

న్యూస్ బాక్స్

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్ఎస్)లో ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఇమ్రానా బేగం తెలిపారు. హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థులు అప్లై చేసుకోవాలని చెప్పారు. హిందీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు కోసం హిందీ పండిట్, ప్రచారక్ డిగ్రీ చేసిన వారు అర్హులని తెలిపారు. అలాగే పీఈటీ గెస్ట్ పోస్టు ఫ్యాకల్టీకి ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ పూర్తి చేసినవారు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 31 వరకు సంబంధిత ధ్రువపత్రాలతో నాసర్‌పురలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేర్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్‌లైన్ మార్పు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు నిమిత్తం సోమవారం చేర్యాలలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీఎస్ఎ్ ఎన్‌పీడీసీఎల్ టౌన్ ఏఈ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చర్చిప్రాంతం నుండి పాత బస్టాండు పరిధిలో ఉదయం 10నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

రాయపోల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ గ్రామానికి చెందిన గల్వ సత్తిరెడ్డి ఇటీవల చేగుంట మండలం వల్లూరు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సోలిపేట సతీష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, నాయకులు ఇప్ప దయాకర్, దయాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

ములుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తండ్రి గంగలమైన నర్సయ్య అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన వెంట నర్సింలు, నాగేష్, రమేష్, శ్రీనివాస్, శివరాములు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆసరా పెన్షన్లను పెంచి.. కొత్తవారికి మంజూరు చేయాలి

మిరుదొడ్డి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా ఆసరా పెన్షన్లను పెంచి.. కొత్తవారికి మంజూరు చేయాలని దళితబహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో ఆయన డీబీఎఫ్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చే వివిధరకాల పెన్షన్లను పెంచుతామని చెప్పి, ఇప్పటివరకు పెంచకపోవడం దారుణమన్నారు. అలాగే అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్‌నాయకులు శంకర్, చెవుల శంకర్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మిరుదొడ్డి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాయడానికి తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రప్రభుత్వం ఒడిగట్టిందని మండిపడ్డారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

దుబ్బాక,జూలై27(ఆంధ్రజ్యోతి):వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలను అందించాలని సీఐటీయూ మెడికల్‌అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం దుబ్బాకలోని వందపడకల ఆసుపత్రిలోని శానిటేషన్, కేర్‌టెక్, సెక్యూరిటీ గార్డ్స్ సీఐటీయూలో చేరారు. కార్మికులకు ఆరోగ్యభద్రతకార్డులను అందించడంతో పాటు కనీస వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, కార్మికులు తదితరులున్నారు.

వంతెన నిర్మాణానికి మోక్షమెన్నడో?

- గత ప్రభుత్వంలో రామునిపట్ల-గోనెపల్లి మధ్య హైలెవల్ వంతెనకు రూ. 14.45 కోట్ల నిధులు మంజూరు
- 2023లో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన
- ఏడాదిన్నర గడిచినా ప్రారంభం కాని నిర్మాణ పనులు
- ప్రస్తుతం వరద వస్తే రాకపోకలకు బ్రేక్
- పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు




రామునిపట్ల- గోనెపల్లి మధ్య లోలెవల్ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు, రాకపోకలు నిలిపివేసిన అధికారులు (ఫైల్)

చిన్నకోడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం రామునిపట్ల - గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై లోలెవల్ వంతెన ఉండటంతో ప్రతీ వర్షాకాలంలో వరద ఉధృతి కారణంగా పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన, దాంతో పాటు గోనెపల్లి వరకు సుమారు 3 కి.మీల మేర అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ. 14.45 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో 2023 అక్టోబరులో హై లెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన జరిగి ఏడాదిన్నర గడిచినా హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

వర్షం వస్తే రాకపోకలు బంద్

ప్రతీ వర్షాకాలంలో రామునిపట్ల - గోనెపల్లి గ్రామాల మధ్య వాగు ఉధృతి కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో యేటా రెండు గ్రామాల మధ్య 2 నుంచి 3 రోజుల పాటు రాకపోకలు నిలిపివేస్తుండగా వరద ఉధృతి తగ్గేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగు అవతలి వైపు వ్యవసాయ బావులు ఉన్న రైతులు పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు.

ఇతర గ్రామాలకు వెళ్లాలంటే దూరాభారం

మండలంలోని గోనెపల్లి, శంకరాయకుంట, ఓబులాపూర్, కస్తూరిపల్లితో పాటు నంగునూరు మండలంలోని రాజగోపాల్ పేట, పాలమాకుల గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇతర మార్గం గుండా ఇబ్రహీంనగర్ మీదుగా అదనంగా ప్రయాణించి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ రియాజ్‌ను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో సంప్రదించగా స్పందించకపోవడం గమనార్హం.



హై లెవల్ వంతెనకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

రాజకీయాలకతీతంగా దుబ్బాక అభివృద్ధికి కృషి



పోశమ్మగుడి పునర్‌నిర్మాణం పనులకు భూమిపూజ చేస్తున్న మెదక్ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే

దుబ్బాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాకలో ఆదివారం నిర్వహించిన పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులకు ఎంపీ, ఎమ్మెల్యే హాజరై భూమిపూజ చేశారు. పార్టీలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ పరస్పరం పలకరించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. భూమిపూజ అనంతరం వారిద్దరు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి తాను పాటుపడుతానని, మల్లన్నసాగర్ కాలువ పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని ఎంపీ రఘునందన్‌రావు హామీ ఇవ్వగా, ఎంపీతో కలిసి తాను మల్లన్నసాగర్ కాలువల పూర్తికి పనిచేస్తానని, దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు తనవంతుగా పాటుపడుతానని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య, దుబ్బాక గ్రామపెద్దలు ఆర్. రాజమౌళి, వడ్లకొండ శ్రీధర్, వనితారెడ్డి, సుభాష్‌రెడ్డి, గన్నెబుచ్చిరెడ్డితో పాటు పట్టణ కౌన్సిలర్లు, వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దుబ్బాకలో నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని టీవీ ద్వారా కార్యకర్తలతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ మల్లారెడ్డి, నాయకులు సుభాష్‌రెడ్డి, సుంకు, రమేష్‌రెడ్డి, ఎన్‌చారి, వెంకట్‌గౌడ్, మనోజ్, రవీందర్, తదితరులున్నారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సన్మానాలు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

సిద్దిపేట కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పలువురికి ప్రశంసాపూర్వక సన్మానాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తణుకు అంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో అధిక మార్కులు పొందిన విద్యార్థిని విద్యార్థులకు, పలు దేవాదాయ ధర్మాదాయ శాఖలో చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, డైరెక్టర్‌లుగా నియమించబడిన వారికి సాహసపోతమైన కార్యక్రమాల్లో పాల్గొన్న 100 మందికి ప్రశంసాపూర్వక సన్మానాలు నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, పలువురు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్ గుప్తా, కోశాధికారి డాక్టర్ మాంకాల నవీన్ కుమార్, మాజీ అధ్యక్షుడు కాసం నవీన్, అదనపు ప్రధాన కార్యదర్శి గంప కృష్ణమూర్తి, ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు యాసాల వెంకట లింగం, రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శి హేమలత, గజ్వేల్ పురపాలక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి, నాచారం శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం చైర్మన్ పల్లెర్ల రవికుమార్, యువజన విభాగం అధ్యక్షుడు మాంకాల నగేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బా మాధవి, సేవాదళ్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ రావికంటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ మొదలైన కరెంటు కష్టాలు

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ కరెంటు కష్టాలు మొదలయ్యాయని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనను రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతలతో పొలం వద్దనే కరెంటు కోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా నిరంతరంగా లేకపోవడం, వచ్చిన సరఫరాలో సైతం విద్యుత్ నాణ్యత లేకపోవడంతో మోటర్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని మండిపడ్డారు.

గజ్వేల్ నియోజకవర్గంలో ఒక నెలలో 200 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపారు. రైతుబంధు డబ్బులు మోటార్ల రిపేర్లకి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగు బాధల నుంచి, కరెంట్ కష్టాల నుంచి గట్టెక్కిన తెలంగాణ రైతాంగం ప్రస్తుతం మళ్లీ కరెంట్ కష్టాలతో అల్లాడుతుందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి, కరెంట్‌ను నాణ్యతగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నిరుపేద కుటుంబాన్ని ఆదుకుంటాం

మిరుదొడ్డి,జూలై27(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి రాయారపు ఎల్లయ్య(55) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుడి కుమారుడు దివ్యాంగుడని, అతడికి కాంట్రాక్టుగానీ, అవుట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతుడి కుటుంబానికి నిత్యావసర సరుకులతోపాటు రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వెంట నాయకులు లింగం, సోమేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులున్నారు.



బాధిత కుటుంబానికి నిత్యావసరాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ



ఎల్కల్‌లో ఎడ్లబండ్లతో ఊరేగింపు

ఎల్కల్‌లో బోనాల ఊరేగింపు

రాయపోల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కల్ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎడ్ల బండ్లు, బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఎడ్లబండ్లను అందంగా అలంకరించి గ్రామంలోని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. రాత్రి మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా జీడాల సురేశ్, కుందారపు రాములు, దేవనబోయిన నర్సింహులు, చిరుమళ్ల శ్రీనివాస్, దేవనబోయిన సాయికుమార్, దేవనబోయిన సత్యానారాయణ, దేవనబోయిన వేణు, దేవనబోయిన కరుణాకర్, కర్రోల్ల మహేందర్ తదితరులకు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం కొమ్మూరి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాటుపడుతుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మద్దూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచు మేక మాధవిగోపాల్, వడ్డెర సంఘం మద్దూరు మండలాధ్యక్షుడు కొడిదెల రాజు తదితరులు ఆదివారం బీజేపీలో చేరారు. బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేశ్‌గౌడ్, మోకు ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు వారికి బీజేపీ కండువా కప్పి స్వాగతం పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ జెండా ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు యామ శ్రీకాంత్, పైసా బాలకృష్ణ, బొల్లు కిట్టు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో సమస్యలు పరిష్కరించాలి



గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మునిసిపాలిటీలో నిర్మిస్తున్న బస్టాండ్‌ల నిర్మాణం, ఔటర్ రింగ్ రోడ్ పూర్తిచేయాలని, పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముంపు గ్రామాల కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలు విడుదల చేయాలని కోరారు. వర్షాలతో కాలనీలలో, రోడ్లపై నీళ్లు నిలబడుతున్నాయని ముందస్తు చర్యలు తీసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మొగుల్ల రాజు, స్వామి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

మద్దూరు, జూలై27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని బీఆర్ఎస్ మద్దూరు మండలాధ్యక్షుడు మేక సంతోశ్ పేర్కొన్నారు. గాగిళ్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, త్వరగా నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా భూభారతి దరఖాస్తుల పరిశీలన



సెలవురోజున విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ కృష్ణమోహన్, సిబ్బంది

రాయపోల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన రెవెన్యూ అధికారులు ఆదివారం కూడా భూభారతి పనుల్లో నిమగ్నమయ్యారు. భూ సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన భూ భారతి దరఖాస్తుల పరిశీలన పనులను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో తహసీల్దార్ కృష్ణమోహన్‌తో సహా సిబ్బంది సెలవు రోజు అయినప్పటికీ కార్యాలయానికి వచ్చి భూభారతి దరఖాస్తుల పరిశీలన జరిపారు. రాయపోల్ మండలంలో వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం 1,742 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. సాదా బైనామాల దరఖాస్తులు మినహాయించి మిగతా వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు. నిర్దేశిత గడువులోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



కొల్గూరులో శివాజీ విగ్రహానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు

గజ్వేల్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొల్గూరు గ్రామంలో ఆదివారం రాజకీయాలకు అతీతంగా ఛత్రపతి శివాజీ విగ్రహానికి హైందవ సోదరుల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతి స్వామి, బీజేపీ నాయకులు బండారు మహేష్, మాజీ ఉపసర్పంచ్ గొల్ల స్వామి, మల్లం సురేందర్, కొండల్‌రెడ్డి, నాగరాజుగౌడ్, పురం అంజనేయులు, గొడుగు రవి, కురుమ అశోక్, గ్రామ పెద్దలు, యువకులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గం ఎన్నిక

కొండపాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిధిలో ని దుద్దెడ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల కిషన్, ఉపాధ్యక్షుడిగా బోకే రామచంద్రం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లి భూపాల్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ నబీ, ముత్యాల దేవరాజు, వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్, వాసరి కనకరావు, కోశాధికారి దెబ్బట యాది మల్లు, కార్యదర్శిగా చంది రమేష్, సహాయ కార్యదర్శి కోడూరు ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి సింగంపాక రాజు, సలహాదారులుగా ఉప్పర్ శీను, సనువాలా కైలాస్, ఎర్రగొల్ల మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల అధ్యక్షులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం అందరికి స్ఫూర్తిదాయకం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్వగృహంలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సర్దార్‌ఖాన్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నక్కరాములు గౌడ్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, నక్కరేగొండగౌడ్, జహీర్, అజ్గర్, తలకొక్కుల ప్రేమ్‌కుమార్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాత ఆర్డీవో కార్యాలయం వద్ద నిలిచిపోయిన రింగ్‌రోడ్డు నిర్మాణం

ఎక్కడి పనులు అక్కడే

(5వ పేజీ తరువాయి)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం బస్టాండ్లు లేవనే అపవాదును మూటగట్టుకోగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కూడా బస్టాండ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్ల పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ప్రయాణికులు వాన, ఎండకు రోడ్లపై నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బిల్లుల చెల్లింపులో ఆలస్యమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

మున్సిపాలిటీ పరిధిలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. యూజీడీ పనులు, మిషన్ భగీరథ పనులు చేపట్టడంతో గత ప్రభుత్వ హయాంలో బీసీ రోడ్ల నిర్మాణం జరగలేదు. రూ.22కోట్లు మంజూరు చేసినా అవి సరిపోకపోవడంతో ప్రధాన రోడ్లన్నీ సీసీ లేక వర్షాలకు గుంతలుగా మారి నీరు నిలబడుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలు జారిపడి గాయాలపాలవుతున్నారు.

మల్లన్నసాగర్ పంచాయతీ అయోమయం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీకి సంబంధించిన పంచాయతీ ఎటూ తేలడం లేదు. భూనిర్వాసితులు తమ పరిధి మున్సిపాలిటీనా లేక గ్రామపంచాయతీనా అనే అయోమయంలో ఉన్నారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి గ్రామాలను తొలగించిన ప్రభుత్వం, మున్సిపాలిటీలో విలీనంపై మీనమేషాలు లెక్కిస్తోంది. మున్సిపాలిటీలో విలీనం చేస్తే వెంటనే జీవో విడుదల చేయాలని, ప్యాకేజీ, పరిహారం ఇవ్వాలని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. యూజీడీ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించి పనుల విషయంలో చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



చిత్తడిగా మారిన బాలాజీ ఎన్‌క్లేవ్ రోడ్డు